# జీరంగి

మునెయ్య దగ్గిరుండే జీరంగిని సూసినాల్నుంచీ శివునికి నిద్దర్లో గూడా అదే కనపడ్తాంది. ఎంత పెద్దదో! ఎంత బాగుండాదో! ఎన్ని రంగులుండాయో దానికి! కలుపు తీయనుబోయిన వాళ్ళమ్మకాడికి బోతే, సేలో దొరికిందట అది. అది ఎగిరే తప్పుడైతే 'బుర్, బుర్' అని యింగా బాగుంటాదంట. మునెయ్య జీరంగి కతలు సెప్తావుంటే, శివుడూ, బింగిసెవులోడూ, నత్తోడూ, నాగన్నా, రోజూ యింటా వుండారు నోరు తెర్సుకోని. అగ్గిపెట్లో తుమ్మాకు పర్సి, దాని మీంద జీరంగిని పండుకోబెట్టి, అగ్గిపెట్టెను సల్లాడం[1] జోబులో యేసుకున్నాడు మునెయ్య.

జీరంగుండే అగ్గిపెట్టెను జోబులో పెట్టుకోనుండే మునెయ్యను యిసిత్రంగా సూస్తావుంటారు వాళ్లు. "ఎట్టుండాది?" అని మునెయ్య మొకంలోకి సూస్తా అడుగుతారు. "అది మోత్తా[2] వుండేది నాకు యినపడ్తాంది" అంటాడు మునెయ్య. "ఏదీ మేం సూస్తాం" అనడిగితే, "పొద్దాకులూ[3] సూడగూడ్దు, అట్ట సూస్తా వుంటే గుడ్లు పెట్టదు" అని ఎచ్చరిస్తాడు మునెయ్య. అది గుడ్లు పెడ్తే వాళ్లకు గుడ్లను యిస్తానని సెప్పినాడు గనక, వాళ్ళింగ సూస్తామని అడగలేరు. అట్టడగరు గానీ, మునెయ్య పోయినకాడికల్లా వాళ్లూ పోయి, మునెయ్య సల్లాడం జోబుకాడ వొంకోని సెవులు బెట్టి యిని, "మోదలేదే...!" అనడుగుతారు. "పక్కోళ్ళకు యినపడ్దు, అగ్గిపెట్టె జోబులో వున్నోనికే యినపడేది" అంటాడు మునెయ్య.

"అబ్బా......బ్బా! నా జోబులో రోంతసేపు యేసుకోని యింటా బా......." అని అందరూ అడుగుతారు. "తావు మార్సగూడ్దు" అంటాడు మల్లా మునెయ్య. మొదట్లో శివునికి కలవరంలో రంగురంగుల జీరంగే కనపడేది. తమ సేలో కందిసెట్టు కింద కూకోనుంటే 'బుర్'మని సెబ్దమయితానే ముందుగా యిమానం అనుకున్నాడంట మునెయ్య. మల్ల జూస్తే, ఈ జీరంగంట! సాట్న..... సాట్నబోయి తటక్కిన పట్టుకొన్నాడంట. ఇజ్జెప్పినాక, శివునికి కలవరంలో కనపన్నెప్పుడు జీరంగి 'బుర్'మని యిమానమాల మోదడం మొదులుపెట్టింది. ఒక్కొక్కసారి దూరాన యిమానమాల వుండి, దగ్గిరికొచ్చినాంక రంగురంగుల జీరంగయిపోతాది.

ముందు జీరంగిని పట్టుకొన్నెప్పుడు, దాని పెండ్లాం గూడా పక్క కందిసెట్టు మీదున్నెట్టు సెప్పినాడు మునెయ్య. "పొద్దాకులూ సూస్తే గుడ్లు పెట్టదు" అన్సెప్పినప్పుడు, "మొగదనీ, దాని పెండ్లాం గూడా వున్నిందనీ సెప్తివే, గుడ్లెట్ల పెడ్తాది ?" అని బింగిసెవులోడు అడిగినాడు. "కాదు, ఆ పక్కనున్నింది దీని మొగుడు" అని తేల్చినాడు మునెయ్య అప్పుడు. "ఎట్ట తెల్సు?" అంటే, ఆడ్దానికైతేనే అంత మోతుంటాదనీ, మొగదానికైతే అంతుండనే వుండదనీ, వూరికే 'పిర్, పిర్' మంటాదనీ సెప్పినాడు. "ఆడ్దయిన్దాన్నే తుమ్మాకు మీంద గుడ్లు పెట్టదానికని పండుకోనుండాది. మొగదైతే ఎందుకు పండుకోనుంటాది?". వాళ్ళు "అవు" అన్నారు. బింగిసెవులోడు గూడా అట్టడిగింది మునెయ్య అబద్దం సెప్తావుండాదని

1) నిక్కరు 2) ధ్వనిస్తూ 3) పదేపదే

కాదు, కతలో ముందటికీ యెనక్కీ యాదన్నా తేడా కనపడ్తే యినేవాళ్లడగరూ, అట్టడిగినాడు. అంతే !

అయితే, మునెయ్యట్టా కాదు. వాడు వాళ్ళకంటే పెద్దోడు. జీరంగిని ముందు సూపిచ్చినప్పుడు మొగదనీ, మాంచి పాయంలో వుండాదనీ సెప్పినాడు. అట్ట సెప్పినోడే అది ఆడ్దని మల్ల సెప్పాల్సి వొచ్చింది. "ఒక్కసారి సూపిచ్చు, ఒక్కసారి సూపిచ్చు" అంటడుగుతా, నల్గురూ మునెయ్యకు తినేటియి పెట్టడం మొదులుపెట్నారు. సెనిక్కాయిపప్పులూ, బెల్లం, జొన్నరొట్టె యిట్ట వాళ్ళేంది తెచ్చుకుంటే అది యియ్యబట్నారు. యీ పక్కోడూ ఆ పక్కోడూ ఇచ్చేది రొండు సేతుల్తో తీసుకోని తింటా మునెయ్య, ఒకసారి జోబులో నుంచీ అట్ట అగ్గిపెట్టెను బైటికి తీసి సూపిస్తా, యింగోసారి జేబులో వుండగనే తట్టడిసి[4] సూపుతా వొచ్చినాడు. ఎంత కాదన్నా వాళ్ళ నోటికాడియి తను తినిందాన జీరంగి గుడ్లు పెట్నాక ఆ గుడ్లు యిస్తానని మాటిచ్చినాడు వాళ్ళకు. ముందు మొగదని సెప్పిన జీరంగిని, మల్ల ఆడ్దని సెప్పడమే అన్ని రకాలా వాటంగా కనపడింది మునెయ్యకు. ఆడ్దని సెప్పిన్దాన్నే గుడ్లనిస్తానని అన్నాడు. వాళ్లు పొద్దాకులూ సూపియ్యమనకుండా! సూపిస్తే గుడ్లు పెట్టదని బెదిరిచ్చినాడు. యిప్పుడు వాళ్ళు జీరంగిని సూపియ్యమనకుండా "గుడ్లు పెడ్తాందా?" అనడగబట్నారు. "రేపో, మన్నాడో పెడ్తాది" అని సెప్తావచ్చినా, అప్పుడప్పుడూ సూపిచ్చక తప్పేదిగాదు. "ఏం జేస్తావుండాదో సూస్తాం" అని ఆత్రంగా సూస్తే... అది ఏం జేస్తావుండేది గాదు. అగ్గిపెట్లో తుమ్మాకు మీంద అట్నే పండుకోని వుండేది. సచ్చిపోయిందేమో అని, అగ్గిపెట్ను వూంచుతే,[5] అది సిన్నంగా సాపుజంపులుగా కాళ్ళు కదిలిచ్చేది. ఆకిరికి....... అది మునెయ్యకు సేలో దొరికినప్పుడు 'బుర్' మని యిమానమాల ఎగుర్తా వొచ్చిందన్న సంగతి యెవురికీ గ్యాపకమే ల్యాకుండా పోయింది. యిది కనిపెట్న మునెయ్య "జీరంగీ, గుడ్లూ మీకు మీకే తీసుకోపోండి" అని ఇచ్చినాడు. జీరంగి వున్న అగ్గిపెట్టెను తలా ఇంతసేపు పట్టుకుంటే, వాళ్ళ సేతులు వొనికినాయి. దాన్ని ఒక్కొక్కరి దగ్గిరా రోన్ని రోజులు పెట్టుకోవాలనుకున్నారు. అయితే, ఎవురి దగ్గిరా దాన్ని పెట్టుకోడానికి కుదర్లా. వాళ్ళ పెద్దోళ్లు జీరంగిని ఇంట్లోకి తెస్తే, ఎనుములు తంతాయనీ పాలియ్యవనీ అర్సినారు. జీరంగిని తెచ్చింది ఎనుముల కెట్ట తెల్చతాదో అనుకొన్నారు. ఎనుములు ల్యాకుండా వుంటే జీరంగిని వున్నిచ్చుకోని వుందుము గదా అనుకొన్నారు.

ఏమనుకొన్నా దాన్ని మల్లా మునెయ్యకాడికి తీసకరాక తప్పలేదు. "నా కొద్దు, మీకు మీకే ఇచ్చినా గదా" అన్నాడు మునెయ్య. "అబ్బబ్బా.... తీసుకోబ్బా, మా వాళ్ళు అర్సుతాండారు" అని బంగపోయినారు. "అయితే పారెయ్యండి" అన్నాడు మునెయ్య. అగ్గిపెట్టె తెర్సి సూస్తే... పారేసినా అది ఆన్నే పడుంటాదని అనిపిస్తాంది. ఎగిరేది మర్సిపోయినట్టుండాది. అట్టాటిదాన్ని ఎట్ట పారెయ్యాల? వాళ్ళకు దిక్కు తెలలా. జీరంగి అట్టయినందుకో, వాళ్ళ పెద్దోళ్ళు అర్సుతా వున్నెందుకోగానీ వాళ్ళ కండ్లకు నీళ్ళొచ్చినాయి. జీరంగిని తీసుకొన్నెందుకు మునెయ్యకు తినేటియి పెడ్తానే వుంటామని, కండ్ల నీళ్లతోనే వొప్పుకొన్నారు!

❀

4) తట్టి చూపి 5) కదిలిస్తే